కథ

## ఆర్.వి.చలపతి

# పునరపి మరణం

శివరామయ్య చనిపోయి ఏడు రోజులయింది. పదకొండవ రోజున కర్మ చేయాలని నిశ్చయించారు.

ఆ వూర్లో శివరామయ్యను తెలియనివారు లేరు. కాంట్రాక్టరుగా బాగా సంపాదించాడు. స్వంతంగా రెండు ఇళ్ళు వున్నాయి. బ్యాంకులోనూ, యింట్లో యినప్పెట్టెలోనూ ధనలక్ష్మి వూపిరాడక గింజుకుంటూ వుంది.

'పిల్లికి బిక్షం వేయడు'

'ఎంగిలి చేత్తోకాకిని అదిలించడు'

'పరమలోభి'

ఊరంతా ఎన్నెన్ని అనుకుంటేనేం! తన పిల్లలకు బాగానే సంపాదించి పెట్టిపోయాడు.

దానిక తగినట్టు పిల్లలు కూడా పెద్దగా చదివి కాలేజీ చదువులకోసం అతడిని ఖర్చుపెట్టనీయలేదు ఇద్దరు కొడుకులూ ఇంటరుతోనే చదువులు ముగించేసి ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగాలు సంపాదించుకునేశారు.

కొడుకులు పెద్దగా చదువుకోలేదని బాధపడలేదు శివరామయ్య. పైపెచ్చు మంచి వుద్యోగాలు సంపాదించుకున్నారని సంతోషించాడు. ఆదాయం పెరిగింది మరి!

ఒకే ఒక్క కూతురు శ్యామల మంచి మార్కులతో 'స్కాలర్‌షిప్' సంపాదించుకొని కాలేజీలో చదువుకుంటూంది.

పెద్దకొడుకు శంకరానికి మంచి సంబంధం కుదిరింది. వివాహం ఆడంబరంగా చేయాలనుకున్న వియ్యంకుడిని దానికయ్యే ఖర్చు కూడా కట్నంతో బాటు యిచ్చేస్తే పిల్లలు సుఖంగా వుంటారని నచ్చచెప్పి, తిరుపతిలో నిరాడంబరంగా పెళ్ళి చేయించేశాడు శివరామయ్య.

రెండవ కొడుకు రవి ఆ మాత్రం కూడా ఖర్చు పెట్టలేదు. ఒక ధనవంతుల పిల్లను ప్రేమించి, రిజిస్ట్రారు ఆఫీసులో పెళ్ళి చేసుకున్నాడు. తల్లి తండ్రులకు ఒక్కగానొక్క కూతురు కావడంతో కట్నం లేకున్నా బాధపడలేదు శివరామయ్య. ఎటూ వాళ్ళ ఆస్తి మొత్తం కూతురికే చెందుతుంది కదా అనుకున్నాడు.

స్నేహితులను పదిమందిని పిలిచి 'గ్రాండ్'గా 'రిసెప్షన్' ఏర్పాటు చేయాలన్నాడు రవి.

అప్పుడు శివరామయ్యకు మొదటిసారిగా గుండెపోటు వచ్చింది. హడావుడిగా డాక్టరుకు ఫోను చేయబోయారు కొడుకులు. అంతలోనే తేరుకున్నాడు శివరామయ్య. అనవసరంగా డాక్టరుకు ఖర్చు పెట్టబోయిన కొడుకులను మందిలించాడు.

"మీ మామగారి ఆస్తి నీ భార్యకు చెందాక 'గ్రాండ్'గా పార్టీ యిద్దువుగానీ" అన్నా రవితో.

ఆ మాటలలో ధ్వనించిన అర్థానికి రవి భార్య మోహం ముడుచుకుంది.

అలాగే అతని షష్టిపూర్తి రోజున రుక్మిణి శివాలయంలో బీదలకు అన్నదానం చేద్దామని ప్రతిపాదించినప్పుడు శివరామయ్యకి రెండవసారి గుండెపోటు వచ్చింది. దాంతో అందరికీ శివరామయ్యకు గుండెపోటు యెప్పుడు వస్తుందో అర్థమైపోయింది. చివరికి రూపాయి దక్షిణ యిచ్చి కర్పూరహారతితో సరిపెట్టింది రుక్మిణి.

తండ్రి పిసినారితనాన్ని చూసి పండ్లు కొరుక్కున్నారు కొడుకులూ, కూతురు. బాగా అలవాటయిపోయింది కాబట్టి 'ఈ మనిషిని మార్చలేము' అనుకొని నిర్లిప్తంగా మారిపోయింది భార్య రుక్మిణి. ఇక వూర్లో యెవరూ శివరామయ్యను గురించి మంచిగా చెప్పుకున్నదేలేదు.

ఈ పరిస్థితులలో శివరామయ్య చనిపోయాడు. పెద్ద కర్మ యింకా ముగియలేదు కనుక అతని ఆత్మ (సూక్ష్మ శరీరం) యింకా ఆ యింట్లోనే తిరుగుతూ వుంది.

ఆ రోజు రాత్రి భోజనాలయ్యాక యింట్లో అందరూ హాల్లో సమావేశమయారు.

"మీ తాతగారు చనిపోయినప్పుడు కూడా బంధువులంతా వచ్చి పడతారని భయపడి వుత్తర క్రియలు ముగిసిపోయాక అందరికీ చావు కబురును ఒక కార్డు ముక్కలో రాసి పడేసి వూరుకున్నారు మీ నాన్నగారు. అప్పుడు అందరూ చీవాట్లు పెడుతూ రాసిన వుత్తరాలు చూసి ఆయన చలించలేదు గానీ నా తల మాత్రం వాచిపోయింది. ఆ రోజుతో మన బంధువులందరూ మన కుటుంబంతో సంబంధాలు తెంచుకున్నారు. అందుకే మన యింటికి యెవరూరారు. కనీసం మీ నాన్నగారి వుత్తర క్రియలకైనా బంధువులందరినీ, వూర్లో వారందరినీ పిలిచి భోజనాలూ అవీ బాగా యేర్పాటు చేయాలిరా. లేకుంటే మీ పితృదేవతలు శపిస్తారు" అంది రుక్మిణి కళ్ళు వొత్తుకుంటూ.

"నేనూ అదే చెప్పబోతున్నాను. నాకు బుద్ధి తెలిశాక మన యింటికి పదిమంది రావడం గానీ, పది మందికి మనింట్లో భోజనం పెట్టడం గానీ నేను చూడలేదు. కనీసం నా పెళ్ళికి మా మామగారు ధారాళంగా ఖర్చుపెట్టాలనుకున్నా పడనీయలేదు నాన్నగారు. నలుగురి ముందూ నాకు తల తీసేసినట్టయింది. ఇప్పుడైనా మా 'కొలీగ్స్'నూ, స్నేహితులనూ పిలవాలనుకుంటున్నాను" అన్నాడు శంకరం.

"నా పెళ్ళికి మాత్రం యేం వూడబొడిచాం! తిరుపతి వెళ్ళే ఖర్చు కూడా లేకుండా చేశాను గదా! కనీసం నలుగురికీ 'పార్టీ' అయినా యిచ్చామా! ఇప్పటికీ దెప్పిపొడుస్తూ వుంటారు మా అత్తగారింటివైపు వాళ్ళు. ఈ సందర్భంలోనైనా అందరూ అదిరిపోయేలా యేర్పాటు చేయాల్సిందే" అని వంత పాడాడు రవి.

తన వంతుకు అందుకుంది శ్యామల.. "నేను ఇంటర్‌లో ర్యాంక్ తెచ్చుకున్నప్పుడు కూడా మా ఫ్రెండ్స్ యెవరికీ పార్టీ యివ్వలేదు. ఇప్పటికీ వాళ్ళంతా నన్నుయెంత యెగతాళి చేస్తూంటారో తెలుసా! కనీసం యిప్పుడైనా మా క్లాస్‌మేట్స్ అందరినీ పిలవాలనుకొంటున్నానన్నయ్యా!"

ఇదంతా వింటున్న శివరామయ్య ఆత్మ విస్తుపోయింది.

"మీ పెండ్లి విందులూ, పరీక్షల్లో ర్యాంక్ తెచ్చుకున్నందుకు పార్టీలూ నా కర్మతో ముడిపెడతారేంట్రా! పైసా, పైసా కూడబెట్టి దాచింది మీ భవిష్యత్తు కోసమే కదట్రా! ఆ డబ్బులను యిలా తగలేయకండ్రా!" అని అరిచింది ఆ ఆత్మ. కాకుంటే యెవరికీ వినబడలేదు.

"రేపు వుత్తర క్రియల పత్రికలు అచ్చయి వచ్చేస్తాయి. మన స్నేహితులకూ, వూళ్ళో వాళ్ళందరికీ మనం స్వయంగా అందజేయాలి. ఎవరెవరిని పిలవాలో అందరూ 'లిస్ట్' తయారు చేసిపెట్టుకోండి. ఎవరినీ మిస్ చేయరాదు సుమా!" అన్నాడు శంకరం.

"అవును. ఇది పెండ్లి పిలుపు కాబోలు! అందరినీ బొట్టుపెట్టి మరీ పిలవండి" అంది శివరామయ్య ఆత్మ కొంచెం వెటకారంగానూ, కొంచెం యేడుస్తూనూ.

"అలాగే బ్రాహ్మణునికి దానం చేయడానికి మంచి ఆవును పట్రాండ్రా! గోదానం అన్నిటికన్నా ముఖ్యమైనదీ, శ్రేష్ఠమైనదీన్నూ! ఆయన యే పుణ్యకార్యాలు చేయక పోయినా యిలాగైనా సద్గతికి పంపిద్దాం" అంది రుక్మిణి.

"ఒక్క గోదానమేమిటమ్మా! బీదవాళ్ళకు యాభై మందికి బట్టలు కూడా దానం చేద్దాం. ఇంకా మంచిది" అన్నాడు రవి.

"సువర్ణదానం మరిచిపోయారేంట్రా? అదీ చేయండి" అంది శివరామయ్య ఆత్మ కసిగా.

నిజంగానే సువర్ణదానాన్ని మరిచిపోయిన వారికి తరువాత గుర్తొచ్చింది. అన్ని దానాలూ చేయాలని నిశ్చయించుకున్నారు.

వంట బ్రాహ్మణులు వచ్చారు.

ఏమేమి వంటలు చేయాలో 'లిస్ట్' రాసుకొంటూ వున్నారు.

"నాన్నగారికి కోవా స్వీట్స్ అంటే చాలా యిష్టం. అయితే డబ్బులు ఖర్చుపెట్టి కొనాలంటే భయం. ఎక్కడైనా పెండ్లిండ్లలో తినివస్తే దాన్ని గురించే వారం రోజులదాకా చెప్పుకుంటూ వుండేవారు" అంది శ్యామల.



"చనిపోయిన వారికి యిష్టమైన పదార్థాలు పెద్ద కర్మ నాడు చేసిపెట్టాలి. ఏం చేద్దాం చెప్పండి" అడిగాడు వంట బ్రాహ్మణుడు.

"ఏం చేయాలేమిటండీ! కోవాతో చేసే స్వీట్లు నాలుగు రకాలు చేయండి" అన్నాడు శంకరం.

"అన్నయ్య పెండ్లి తాలూకుదీ, నా యింటర్ ర్యాంక్ తాలూకుదీ, నాన్నగారి కర్మ తాలూకుదీ మొత్తం బకాయి లేకుండా తీరిపోయింది కదమ్మా!" సంబరంగా అంది శ్యామల.

"కాదు తల్లీ! నా ఖర్మ కాలిన తాలూకువి అన్నీ. తగ లెట్టండి. రుక్మిణీ! నేను బ్రతికున్నప్పుడు నాకు తగినట్టుగా వుండి, యిప్పుడు వాళ్ళు యిలా తగలేస్తూంటే చూస్తూ వూరుకుంటావా! ద్రోహీ!" అని భార్యను చూసి పండ్లు పటపట కొరికింది శివరామయ్య ఆత్మ.

మరుసటి రోజు రాత్రి మళ్ళీ అందరూ సమావేశమ య్యారు.

"అందరికీ పత్రికలు చేరినట్లేనా?" అడిగింది రుక్మిణి.

"అందరికీ యిచ్చేశామమ్మా! పోస్టులో పంపినవి కూడా రేపు చేరిపోతాయి. అందరూ వస్తారనే అనుకుం టున్నాను" అన్నాడు శంకరం.

"మొత్తం యెంతమంది రావచ్చు?"

"ఎంత లేదన్నా అయిదారు వందల మంది వస్తారను కుంటాను. అదికాక వందమంది బీదవాళ్ళకు అన్న దానం వేరేగా యేర్పాటు చేశాను. ఇరవై అయిదు ధోవ తులూ, యిరవై అయిదు చీరలూ షాపులో చెప్పి వచ్చాను" చెప్పాడు.

"ఖర్చు యెంతయిందేమిటీ?" అడిగింది రుక్మిణి.

"అడ్వాన్సుగా అయిదువేలు యిచ్చింది కాక యింకో పాతికవేలు యివ్వాల్సి వస్తుందనుకుంటాను" సాధార ణంగా అన్నాడు శంకరం.

'అమ్మో! ముప్పయి వేలే!' అదిరిపోయింది శివరా మయ్య ఆత్మ.

○○○

కర్మకాండలు ముగిసిపోయాయి. శివరామయ్య సూక్ష్మ శరీరాన్ని మరో స్థూల శరీరంలో ప్రవేశపెట్టడా నికి దేవదూతలు వచ్చారు.

ప్రక్కనే కర్మకాండకు వచ్చిన వాళ్ళు మాట్లాడు కుంటూ వెళ్తున్నారు.

"చాలా ఆర్భాటంగా చేశారు శివరా మయ్య కొడుకులు" అన్నాడు ఒకతను.

"అవునవును. ఈ విషయం చనిపోయిన శివరామ య్యకు తెలిస్తే మరోసారి చనిపోయినా చనిపోతాడు" అని నవ్వాడు మరొకతను.

'తను లోభిగా బ్రతికినప్పుడు అందరూ హేళన చేసే వారు. ఇప్పుడు యింత ఖర్చయ్యాక కూడా తనను గురించి యెగతాళిగా అనుకొంటున్నారే! అనవసరంగా ముప్పయి వేలు' అని క్రింద పడిపోయింది గాలిలో యెగు రుతున్న శివరామయ్య ఆత్మ.

దగ్గరగా వచ్చి పరిశీలనగా చూసిన దేవదూతలలో ఒకడన్నాడు, "పునరపి జననం పునరపి మరణం అంటారు. ఇతనేమిటీ యింకోసారి పుట్టక మునుపే మరోసారి చనిపోయాడు!"